తనదాకావస్తే...?

— మద్దంశెట్టి

భీమరాజు ఒడ్డూ, పొడుగులో పేరుకు తగ్గట్టుగానే వుంటాడు. అతని తెలివి తేటల ప్రసక్తి యెలావున్నా, కాకా పట్టడంలో అఖండ ప్రజ్ఞావంతుడు. పైకి పోవాలంటే, 'కాకా' ఖచ్చితంగా వుండాలనే సిద్ధాంతాన్ని జీర్ణించుకున్న వాళ్ళలో అతనొకడు. ఆ సిద్ధాంత పరంగా, పై అధికారుల ప్రాపకంతో మెట్లెక్కేసి, అనతికాలంలోనే మేనేజరు పదవిని చేపట్టేశాడు. అతని గురించి పూర్తిగా తెలిసివాళ్ళు మాత్రమే, అతని తెలివితేటల్ని, అదృష్టాన్ని అభినందించారు. తెలిసినవాళ్ళు నవ్వుకున్నారు.

అయితే, కల్లోకూడా వూహించని అటువంటి అదృష్టం వరించేసరికి, భీమరాజు మనస్తత్వంలో హఠాత్పరిణామం వచ్చేసింది. తన పదవికి, తన అంతస్తుకి తగిన హుందాతనాన్ని మెంటెయిన్ చెయ్యాలన్న అభిప్రాయం అతనిలో అహాన్ని రేకెత్తించింది. దాంతో అతని ప్రవర్తనలోనూ, మాటల్లోనూ గంభీరత చోటు చేసుకుంది. మొన్న మొన్నటి వరకూ సహోద్యోగులుగా తనతో పనిచేసిన వాళ్ళతో సహా అందర్నీ అలుసుగా చూడ్డం, అవకాశం చిక్కితే, వెనకాముందూ చూడకుండా వార్ని అవమానించడం అతనికి దినచర్య అయ్యింది. దాంతో ఆఫీసు సిబ్బందిలో సంచలనం కలిగింది. ఆశ్చర్యంతోపాటు, ఆవేశమూ వచ్చింది. కాని, యేం చెయ్యగలరు ? భీమరాజు చేతిలో అధికారమనే ఆయుధం తళతళ మెరుస్తూ కనిపిస్తోంది మరి !

* * *

అవకాశం కోసం ఎదురు చూస్తోన్న ఆఫీసు సిబ్బందిని, ఆ రోజు జరిగిన ఓ సంఘటన మరింత వుద్రిక్తపర్చింది.

టైపిస్టు నారాయణరావుకి అర్జంటుగా సెలవు కావల్సివచ్చి దరఖాస్తు పెట్టుకున్నాడు. అయితే, ఆ సెలవుని భీమరాజు మంజూరు చెయ్యలేదు. సెలవు పెట్టిన వెంటనే వజావుగా సేంక్షను చేసేస్తే, తన డిగ్నిటీ మాటేమిటి ?...అన్నదే అతని అంతరంగంలో మెదిలిన ఆలోచన.

''నమస్కారం సార్ ...'' స్వయంగా మేనేజరు గదిలోకి వెళ్ళిన నారాయణరావు గొంతది.

''నమస్కారం...'' హుందాగా అన్నాడు, భీమరాజు.

''నా సెలవు రిగ్రెట్ చేశారట ?... నాకు చాలా అవసరంగా సెలవు కావాలి సార్ !'' అన్నాడు నారాయణరావు.

భీమరాజు అదోలా నారాయణరావుకేసి చూశాడు. నారాయణరావు అడిగిన తీరులో చెప్పుకోదగ్గ ప్రాధేయతగాని, నమ్రతగాని, కనిపించలేదతని అధికార దృక్కులకు. అందుకని, అతని మొహం కాస్తంత జేవురించింది కూడాను.

''ఔను. రిగ్రెట్ చేశాను. యూ కెన్ గో నౌ...'' గంభీరంగా అన్నాడు భీమరాజు.

''అర్జంటుగా నేను వెళ్ళాలి సార్...''

''ఓ వారం రోజులు పోయాక ఆలోచిస్తాను...''

నారాయణరావులో సహనం లోపించింది. ''నాకు అవసరమొచ్చినపుడు సెలవివ్వకపోతే, యింక ఆ సెలవు ప్రయోజనం యేముందండీ ?'' ఘాటుగానే అడిగాడు.

భీమరాజు డిగ్నిటీకి అదోఘాతంలా తగిలింది. మొహం ఛీదరించుకున్నాడు.

''నీతో వాదించుక్కూచోడానికి నాకు సమయం లేదు. వెళ్ళి నీ పని చూసుకో !'' విసుగ్గా అన్నాడు.

''అలా అంటే యెలా ? నా అవసరాన్ని...'' అని యింకేదో నారాయణరావు చెప్పబోతూ వుంటే, భీమరాజు సహించలేకపోయాడు. తన అంతస్తు, ఆధిక్యత, గుర్తుకొచ్చాయతనికి. జిడ్డులా నారాయణరావు వదలకపోవడం, అతనికి వుక్రోషం తెప్పించింది. ''గెటవుట్... ఐ. సే...'' గొంతు చించుకొని అన్నాడు భీమరాజు.

నారాయణరావు నిర్ఘాంతపోయాడు. భీమరాజు యెంత ఆఫీసరు హోదాలో వున్నా, అంత మాటంటాడా ? అతనికి కంటినిండా కోపం వచ్చింది. వుక్రోషంతో వొళ్ళు కంపించింది. అయితే, తన వునికిని గుర్తించుకుని, సంభాళించుకున్నాడు. అవమానభారంతో విసురుగా బైటికొచ్చాడు.

నారాయణరావు తనకి జరిగిన అవమానాన్ని

తోటి వుద్యోగులతో చెప్పుకుని యెంతో బాధ పడ్డాడు. భీమరాజు ప్రవర్తనని అప్పటికే అసహ్యించుకుంటున్న వాళ్ళంతా, నారాయణ రావు పట్ల అతని అసభ్య ప్రవర్తనని విరసించారు. మూకుమ్మడిగా అతని ముందుకు వెళ్ళాలనుకున్నారు... అతన్ని అవమానించాలనుకున్నారు. అయితే, భీమరాజు అభిమానులు, అనుయాయులు కొందరు మెల్లిగా ఆ సీనునుంచి తప్పించుకుపోవడంతో, మెజారిటీ లేకపోయింది. ఆ పరిస్థితుల్లో భీమరాజుని ముఖాముఖీ యెదిరించే చొరవ, ధైర్యం యెవరికీ లేకపోయాయి. అవకాశం రాకుండాపోతుందా అని, యెదురుచూడసాగారు.

*　　*　　*

పై సంఘటన జరిగిన మూడో రోజే మేనేజింగ్ డైరెక్టరు రాఘవరావు, ఆఫీసు ఇనస్పెక్షను కోసం వచ్చి, రెస్టు హవుసులో వుంటున్నట్టు ఆఫీసు సిబ్బందికి తెలిసింది. భీమరాజు అనుయాయులు తప్పించి మిగిలిన వాళ్ళు అతన్ని కలుసుకున్నారు.

"ఏమిటి ? మీరంతా యిలా వచ్చారేం ?" అడిగాడు రాఘవరావు.

"సార్! మేం బ్రతుకుతెరువు కోసం వుద్యోగాలు చేస్తున్నాంగానీ, అవమానాలు అనుభవించడానిక్కాదంటే మీరూహర్షిస్తారు. మేం కూడా గౌరవనీయ కుటుంబాలకు చెందిన వాళ్ళమే. మాకూ ఆత్మాభిమానం వుంది" అంటూ తన గోడు చెప్పుకున్నాడు నారాయణరావు.

మిగిలిన వాళ్ళంతా భీమరాజు పట్ల వెలిబుచ్చిన ఫిర్యాదులు సాంతం విన్నాడు రాఘవరావు. నిప్పులేనిదే పొగరాదనుకున్నాడు.

"మీరు చెప్పిందంతా నేను అర్థం చేసుకున్నాను. మీలో రేగిన యీ అలజడికి, మీరు అనుభవిస్తున్న మనోవ్యధకు, నా సానుభూతి. ముమ్ముందు భీమరాజు అలా ప్రవర్తించకుండా మందలిస్తాను. మీరు వెళ్ళండిక..." వాళ్ళకి నచ్చచెప్పాడు రాఘవరావు.

నారాయణరావుతోపాటు, అందరూ ఆ సమాధానానికి తృప్తిగా నిట్టూర్చారు.

"థాంక్స్ సార్ ! మీ మంచితనాన్ని మేం సదా గుర్తుంచుకుంటాం. వస్తాం సార్..." అన్నాడు మరో వ్యక్తి.

అంతా వుత్సాహంతో తిరుగు ముఖం పట్టారు. అందరికంటె యినుమడించిన తృప్తితో కదిలాడు నారాయణరావు.

*　　*　　*

మర్నాడు ఆఫీసు ఇన్‌స్పెక్షను జరుగుతోంది.

భీమరాజు ఛాంబరులో అతని రివాల్వింగ్ చెయిర్‌లో కూచుని, ఫైల్సు తిరగేస్తున్నాడు రాఘవరావు. భీమరాజు అతని ప్రక్కనే నుంచుని, వుట్టిపడే వినయ విధేయతలతో, కేసులు గురించి చెప్తున్నాడు. ఓ కేసు చదువుతూ, హఠాత్తుగా ఆగిపోయాడు రాఘవరావు.

"ఇదేమిటి ? ఈ కేసు డీల్ చెయ్యడంలో యింత జాప్యం యెందుకు జరిగింది మిస్టర్ భీమరాజూ ? దీనివల్ల కంపెనీకి యెంతనష్టం వాటిల్లిందో, కంపెనీ ఇమేజ్ యెలా దెబ్బ తిన్నదో, ఆలోచించారా ?" కోపంగా భీమరాజుకేసి చూస్తూ, అన్నాడు రాఘవరావు.

భీమరాజుకి ముచ్చెమటలు పోశాయి. తాను యే కేసు గురించి భయపడుతున్నాడో, దాని పైనే రాఘవరావు దృష్టి పడినందుకు వణికిపోయాడు.

"ఇది సెక్షనులో జరిగిన జాప్యం సార్ ! ఆ గుమాస్తాని, ఆఫీసు సూపరింటెండెంటుని చెకప్ చేస్తాను ..." అంటూ తప్పించుకో జూశాడు.

"మిస్టర్ భీమరాజూ! కేవలం గుమాస్తాల పైనే బాధ్యతంతా రుద్దాలనుకుంటే మరింక మేనేజరు పోస్టు అవసరం లేదనుకుంటాను. మీరేం చేస్తున్నట్టు ? యూ ఆర్ సోల్లీ రెస్పాన్సిబుల్. మీ సంజాయిషీ సబ్మిట్ చెయ్యండి ..." కోపంగానే అన్నాడు రాఘవరావు.

భీమరాజు నీరైపోయాడు. రాఘవరావు యింత కోపిష్టని అతనికెవ్వడూ తెలీదు. అయినా తననే సంజాయిషీ యిమ్మంటే, తన క్రింద పనిచేసే స్టాఫ్ తనని యింకేం గౌరవిస్తారు ?...అన్న బాధ అతణ్ణి పట్టుకు పీడించింది.

"అదికాదుసార్...అనవసరంగా మీరు..." అని యింకేదో చెప్పబోయాడు భీమరాజు.

"మిస్టర్ భీమరాజూ! మరేం సాకులు చెప్పవద్దు ..." గంభీరంగా అన్నాడు రాఘవరావు.

భీమరాజు సహనాన్ని కోల్పోయాడు. తానూ ఒక అంతస్తులో వున్నవాడే అయినా, తనని యిలా అవమానించడమా ?

"నేను చెప్పేది వినండి సార్..." అసహనంతో యేదో చెప్పబోయాడు భీమరాజు.

భీమరాజు మాటల్లోని అసహనం, ఓ విధంగా యెదిరింపులానే తోచింది రాఘవరావుకి. ఆఫీసు సిబ్బంది ఫిర్యాదు ఆ క్షణంలో అతని చెవుల్లో గింగురుపెట్టింది.

మదరాసు సిటిజన్స్ కమిటీ (రిజిస్టర్డ్) వారు జులై 18, 19 తేదీలలో తమ సంస్థ మొట్టమొదటివార్షికోత్సవాన్ని మద్రాసులో వైభవంగా జరుపుకున్నారు. స్వామి శంకరదాస్ ఆడిటోరియంలో జరిగిన ఈ ఉత్సవాల మొదటి రోజున కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేస్తున్న ఆంధ్రాబ్యాంకు డెప్యూటీ జనరల్ మానేజరు శ్రీ శంకరన్, రెండవరోజు ప్రారంభోత్సవం చేస్తున్న ఇన్‌కమ్‌టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఉపాధ్యక్షుడు శ్రీ సిహెచ్. జి. కృష్ణమూర్తి, డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, డా. ఎం. ఎల్. వసంతకుమారి గార్లను చిత్రంలో చూడవచ్చును.

నవ్యతకోరే నవలా
ప్రియులకు నవ్య
నవలా నీరాజనం. *

కొడాలి సాంబశివరావు

రాగాభిషేకం....10-00
ప్రేమవిజేత....10-00
పచ్చనికలశం....9-00
వెన్నెలహారతి.....9-00
సిరిమల్లెపూవు...15-00
(అనామికసీరియల్)
ప్రేమనీరాజనం..10-00
వసంతకోకిల..10-00

యామినీ సరస్వతి

వెన్నెలజలపాతం..14-00
శ్రావణసంగీతం..12-00

నండూరి రామకృష్ణ

ఆరని అనురాగం.10-00
(ఆంధ్రప్రభదినపత్రిక
సీరియల్) *

పుస్తకములవెలలో 1.రూ.
తగ్గించి M.O.చేస్తే
V.P.P.లో పంపుతాము

మీనా
పబ్లికేషన్స్
చిత్తులూరివారివీధి
నంద్యాల-518501

V.S.

తనదాకా వస్తే...?

"నో ఆర్గ్యుమెంట్... డోంట్ ట్రై టు డిఫెండ్ యువర్ సెల్ఫ్..." కాస్త గట్టిగానే అరిచాడు రాఘవరావు.

ఆ కేకలు విని అప్పుడే ఆఫీసు స్టాఫ్ కొందరు ద్వారం దగ్గరికి వచ్చినట్టు పసిగట్టిన భీమరాజుకి, గుండె ఆగినంత పనయ్యింది. తన అంతస్తుకి విలువేముందింక? ఎంత మేనేజింగ్ డైరెక్టరయితే మాత్రం, తనని యిలా అవమానించడమా?...?

"సార్! మీరు నాకేం శిక్ష విధించినా భరించేవాణ్ణి. కాని, యిలా నన్నవమానించడం సబబుగా లేదు. నాకూ ఆత్మాభిమానం వుంది. వ్యక్తిత్వం వుంది." బాధగా అన్నాడు.

రాఘవరావు భీమరాజుకేసి సూటిగా చూశాడు. "మీ విషయంలో నేనిలా అవమానించడం సబబుగా లేదంటున్నారు. మీకు ఆత్మాభిమానం, వ్యక్తిత్వం వున్నాయంటున్నారు. మరి, మీ ఆఫీసులో పనిచేసే వాళ్ళకేనా ఆత్మాభిమానం, వ్యక్తిత్వం లేనిది? వాళ్ళని మీరు అవమానించినప్పుడు, అది సబబుగా లేదన్న విషయం గుర్తుండదా? ఆత్మపరిశీలన అప్పుడు లేకపోయిందా?" అంటూ చిన్న చిరునవ్వు పెదాలపై చిందించాడు రాఘవరావు.

భీమరాజుకి విషయం యేమిటో యిప్పుడర్థమయ్యింది. రాఘవరావుగారి ఆవేశానికి, అసంతృప్తికి వెనుక గల కారణం యేమిటో తెలుసుకోగలిగాడు. అతని కళ్ళను కప్పిన నీలితెర తొలగిపోయింది. నారాయణరావుపట్ల తన ప్రవర్తనకి సిగ్గుపడ్డాడు. "ఇప్పుడంతా నాకు అర్థమయ్యింది సార్! నిజంగా తప్పు నాదే! ఆ క్షణంలో ఆ వుద్రేకానికి పశ్చాత్తాపపడుతున్నాను. అటువంటి పొరపాటు మరెప్పుడూ జరక్కుండా చూస్తాను. నా తప్పును గుర్తుచేసి, నాకెంతో మేలు చేశారు..." క్షమాపణ చెప్పుకున్నాడు భీమరాజు.

రాఘవరావు తృప్తిగా నవ్వుకున్నాడు. "మిష్టర్ భీమరాజూ! మీ తప్పును మీరు తెలుసుకున్నారు... అది, ఆరోగ్యకరమైన పరిణామం. అధికారం మన చేతిలో వుందని, హద్దులు మీరకూడదండీ! అధికారంతో గౌరవాన్ని సంపాదించలేం... కేవలం అభిమానంతోనే సంపాదించగలం." అన్నాడు సలహా యిస్తున్నట్టుగా.

"ఔను సార్! మీరు చెప్పింది నిజం..." అంటూ భీమరాజు కాలింగ్ బెల్ నొక్కాడు. ప్యూన్ హాజరయ్యాడు.

"టైపిస్టు నారాయణరావుని యిలా రమ్మను..." అన్నాడు.

రెండు నిమిషాల్లో నారాయణరావు లోపలికొచ్చాడు. ఇద్దరికీ సవినయంగా నమస్కరించాడు.

"నారాయణరావ్, నీపట్ల నేను ప్రవర్తించిన తీరుకి సిగ్గుపడుతున్నాను... క్షమించు. రేపట్నుంచి సెలవులో వెళ్ళు..." అన్నాడు భీమరాజు.

నారాయణరావు మురిసిపోయాడు. "థాంక్యూ సార్... థాంక్యూ సార్..." అని యిరువురికీ అభివందనలు చెపుతూ వుత్సాహంగా బైటికి నడిచాడు.

రాఘవరావు ముసిముసిగా నవ్వుతూ, భీమరాజు వీపుమీద తట్టాడు.

ఆ రోజునించి భీమరాజు మారిన మనిషి!!

చిత్తుకాగితాల నుండి ఇథనాల్

పశ్చిమ జర్మనీలోని డోర్నియర్ ప్రయోగశాలవారు చిత్తుకాగితాలవలన మరో వుపయోగం వుందని కనుగొన్నారు. ఒక కిలోగ్రాము చిత్తుకాగితాల నుండి ½ లీటరు ఇథనాల్‌ను తయారు చేయవచ్చునని నిరూపించారు. ఇథనాల్‌ను పెట్రోలుతో కలిపి కార్లలో వుపయోగిస్తున్నారు. బ్రెజిల్ వంటి దేశాలలో ఇథనాల్‌ను చెరుకు నుండి తయారుచేసి పెట్రోలుపై ఆధారపడటాన్ని తగ్గిస్తున్నారు. అయితే కాగితం నుండి తయారుచేసే ఇథనాల్ మరింత శక్తివంతమైనది. పైగ యిది చాలా చౌకపద్ధతికూడా. పశ్చిమ జర్మనీలో లభించే చిత్తుకాగితాలను పూర్తిగా ఇథనాల్‌గా మారిస్తే, దేశంలో పెట్రోలు వాడకం పది శాతం తగ్గగలదని భావిస్తున్నారు.